క్లుప్తంగా

బీటీ రోడ్డు పనుల ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న రాజులమ్మ, తదితరులు

కొయ్యూరు: బీటీరోడ్డు పనులను చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జె. రాజులమ్మ ఆదివారం ప్రారంభించారు. వైఎస్ పాకల నుంచి ఆర్అండ్‌బీ రోడ్డు జంక్షన్ వరకు 1.6 కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా పాడవడంతో రూ.60 లక్షలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాధవికి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ రోడ్డు పూర్తయితే ఇబ్బందులు తొలగుతాయన్నారు. కార్యక్రమంలో నల్గొండ ఉప సర్పంచ్ భవానీ, వార్డు సభ్యురాలు రాజేశ్వరి, గృహసారథులు పాల్గొన్నారు.

వానలు కురవాలంటూ మహిళల పూజలు



గ్రామ పొలిమేరల్లో పసుపు నీటిని పారబోస్తున్న గిరిజన మహిళలు

రాజవొమ్మంగి: ఖరీఫ్ పనుల సమయంలో వర్షాలు కురవక గిరి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో వానలు కురిపించు తల్లీ అంటూ గిరిజన మహిళలు గ్రామ దేవతలకు పరిపరి విధాలుగా పూజలు చేస్తున్నారు. మండలంలో ఏ గ్రామంలో చూసినా ఈ విధంగా మొక్కలు చెల్లించుకుంటున్నారు. ఆదివారం ముర్లవానిపాలెం అటవీ ప్రాంతంలో అనాదిగా కొలువైన చెరుగుకొండమ్మ తల్లికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. అంతకు ముందు గ్రామ పొలిమేరల్లో కడవల కొద్దీ పసుపు నీటిని పారబోశారు. డప్పు వాయిద్యాల నడుమ వారంతా ఊరేగింపుగా అమ్మవారి కొలువైన కొండ వాగు వద్దకు చేరుకుని వర్షాలు కురవాలంటూ పూజలు చేశారు.

జాతీయ జెండా ఆవిష్కరణ



జాతీయ జెండా ఎగుర వేస్తున్న నాగబాబు, తదితరులు

అరకులోయ టౌన్: ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్ నాయక్ ఆదేశాల మేరకు ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ పీవో పి. నాగరాజు జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగాలో భాగంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు ప్రతీ ఇంట్లో జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. ఎస్. వెంకటరమణ, పి. రామన్న పాల్గొన్నారు.

నేడు నూకాంబిక ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం నూకాంబిక అమ్మవారి హుండీ ఆదాయం లెక్కింపు సోమవారం జరగనుంది. దేవాలయంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే భక్తులు ఉదయం 7 గంటలలోపు ఆలయ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 9491000713ను సంప్రదించాలన్నారు.

మూఢ నమ్మకాలపై జేవీవీ పోరాటం

మాడుగుల: నవ సమాజంలో ప్రజల్లో విజ్ఞానాన్ని పెంచి, వారిలో నెలకొన్న మూఢ నమ్మకాలను నియంత్రించడమే జన విజ్ఞాన వేదిక(జేవీవీ) లక్ష్యమని వేదిక సాహిత్య విభాగం రాష్ట్ర కన్వీనర్ యలమంద అన్నారు. ఆదివారం స్థానిక పాల కేంద్రం వద్ద జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. సైన్స్‌లో యదార్థాన్ని ప్రజలు గమనించాలన్నారు. జేవీవీ నాస్తిక సంఘం కాదని, కేవలం సైన్స్, పర్యావరణం కోసం పనిచేస్తోందన్నారు. ప్రస్తుత సమాజంలో యువత పెడదోవ పడుతున్నారని, జేవీవీ కార్యక్రమాల ద్వారా వారిలో అవగాహన పెంచేందుకు కృషి చేయాలని ఎంపీపీ వేమవరపు రామధర్మజ కోరారు. సమాజంలో దురాచారాలను అరికట్టి, విద్యార్థుల్లో విజ్ఞాన శాస్త్రాలపై అవగాహన పెంచేందుకు జేవీవీ చేస్తున్న కృషిని మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు అభినందించారు.

వ్యాధి నిర్ధారణ సులభతరం

- ప్రతి నియోజకవర్గంలో ప్రయోగశాల
- పశువులకు అన్ని రకాల వైద్య పరీక్షలు
- తగిన మందులను సూచించి పశు సంపద వృద్ధికి కృషి
- పాడిరైతులకు ప్రభుత్వం భరోసా



అగ్రిల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

అరకులోయ టౌన్: జీవాలకు చిన్నపాటి వ్యాధి సంక్రమించినా పాడిరైతులు ఆందోళనకు గురవుతుంటారు. ఇకనుంచి వారు అధైర్యపడాల్సిన అవసరం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గంలోని వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌లో ప్రయోగశాల ఏర్పాటు చేసింది. ఇక్కడ పశువులకు సంక్రమించే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, వినియోగించాల్సిన మందులు తదితర అంశాలపై పరీక్షిస్తారు. తద్వారా పశు పోషకులు తమ పశుసంపదను పరిరక్షించుకునే అవకాశం కలుగుతోంది.

రైతులకు వ్యవసాయంతోపాటు పాడిపరిశ్రమలో ప్రోత్సహించడంలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో దాదాపు రూ. 57 లక్షలతో రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. ఈ ప్రయోగశాలల్లో వ్యవసాయ రంగంలో సంక్రమించే తెగుళ్లపై ఓ వైపు ప్రయోగాలు చేస్తుండగా, మరో వైపు పశువులకు సంక్రమంచే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఉపయోగించాల్సిన మందులపై ప్రయోగాలు చేస్తున్నారు. పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పర్యవేక్షణలో ఈ ప్రయోగాలకు ల్యాబ్ టెక్నీషియన్లు చేస్తుంటారు. నియోజకవర్గంలో అన్ని పశువైద్యశాలల నుంచి అందే వ్యాధుల నమూనాలపై ప్రయోగాలు చేసి అనాలసిస్ రిపోర్టులు ఏడీకి అందజేస్తుంటారు. సకాలంలో వ్యాధుల గురించి మందులు అందజేస్తుండటంతో పశువుల మరణాలు తగ్గి పశు సంపద వృద్ధి చెందుతుంది.

ల్యాబ్‌లో 50పైగా రక్త పరీక్షలు

ల్యాబ్‌లో రక్త పరీక్షలు 50 రకాలతోపాటు ఇతర పరీక్షలు చేస్తుంటారు. నియోజకవర్గం పరిధిలోని అరకులోయ, సుంకరమెట్ట, అనంతగిరి, కాశీపట్నం, డుంబ్రిగుడ పశువైద్యశాలల నుంచి సేకరించిన పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, తదితరలకు సంక్రమించే వ్యాధులపై పరీక్షలు నిర్వహిస్తున్నారు. 2022 జనవరి నుంచి ఇప్పటి వరకు 5,792 వివిధ పరీక్షలు ఈ ల్యాబ్‌లో నిర్వహించారు.

– ప్రయోగాలు ఇలా...

పశువుల మూత్రం, పేడ, పాలు, రక్త పరీక్షలు, రేబిస్, చీము, చీముడు, చర్మ సమస్యలకు సంబంధించిన సమూనాలను ఈ ప్రయోగశాలలో పరీక్షించి వ్యాధి లక్షణాలు గుర్తిస్తారు. వీటితోపాటు పశువులకు పలు రకాల టీకాలు వేశాక, వాటి పనితీరు, పశువులో ఏదైనా వైపరీత్యాలు సంభవిస్తే వాటిని పరిశీలించడం లాటివి ఈ ప్రయోగశాలలో జరుగుతుంటాయి. పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులనూ గుర్తిస్తారు. ముఖ్యంగా బ్రిసిల్ వ్యాధిని గుర్తించడం (పునరుత్పత్తి లేకపోవడాన్ని) యాంటీబయోటిక్ నిర్వహణ పరీక్షలు, పాలు, రక్త నమూనాలు సేకరించి ఏ యాంటీబయోటిక్ మందు ఇస్తే పశువుకు వ్యాధి నయమవుతుందో గుర్తించడం, వ్యాధుల బారిన పడి మృతి చెందిన పశువులకు శవ పరీక్షలు, ఇలాంటివన్ని ప్రయోగశాలలోనే నిర్వహిస్తారు. గొర్రెలు, మేకలకు సోకే నట్టల (పారాసైట్స్) నిర్ధారణకు దానికి తగునైన మందులు ఇచ్చేందుకు ఇక్కడ ప్రయోగాలు జరుగుతుంటాయి. అలాగే కోళ్లకు సంక్రమించే వ్యాధులను సైతం ఈ ప్రయోగశాలలో గుర్తిస్తారు. ఏటా పరీక్షలు ప్రయోగాల కోసం ఉపయోగించే రసాయనిక ద్రవణాలు, ఇతర పరికరాలు ప్రభుత్వం మంజూరు చేస్తుంది. జిల్లా పశు సంవర్థక శాఖ వ్యాధి నిర్ధారణ జిల్లా ప్రయోగ శాల నుంచి సరఫరా చేస్తుంటారు.

గిరి రైతులకు ఎంతో మేలు



పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లకు సోకే వ్యాధి నిర్ధారణకు పరీక్షలు నిర్వహించి వాటికి వైద్య సేవ లందిస్తాం. గిరి రైతులకు నిత్యం ఈ ల్యాబ్ అందుబాటులో ఉంటుంది. గతంలో ఏ పరీక్ష చేయాలన్నా విశాఖకు సమూనాలను తీసుకువెళ్లి పరీక్షలు నిర్వహించి, రిపోర్టు వచ్చిన తర్వాత వైద్యం అందించేవారు. ప్రస్తుతం వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు చేసిన తర్వాత ఇక్కడే అన్ని పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఇది గిరిరైతులకు ఎంతో మేలు చేకూరుస్తుంది. వారంతా ఈ సేవలు వినియోగించుకోవాలి.

– డాక్టర్ నరసింహులు, ఏడీ, పశుసంపవర్ధకశాఖ, అరకులోయ

పనసలో ఆధార్ కేంద్రం సేవలు



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ మిల్కి

ముంచంగిపుట్టు: మండలంలో మారుమూల వనుగుమ్మ పంచాయతీ పనస గ్రామంలో సర్పంచ్ మిల్కి ప్రత్యేక చొరవతో సచివాలయ సిబ్బంది ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఆదివారం ఆమె ఈ కేంద్రాన్ని సందర్శించి, ఆధార్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనస, మొక్కపుట్టు, దొరగూడ, ఓల్డెబీరు, సంగడ, దాబుగూడ, తర్లగూడ గ్రామాల గిరిజనులు ఆధార్ కేంద్రంలో తప్పుల సవరణ, నూతన కార్డు నమోదు, వంటి సేవలు పొందాలన్నారు. పంచాయతీ ప్రజలు ఇబ్బందుల దృష్ట్యా అధికారులతో మాట్లాడి ఆయా గ్రామాలకు అందుబాటులో ఉండేలా దీన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ సోందా కాంతమ్మ, గ్రామ వలంటీర్ల పాల్గొన్నారు.

16న చింతపల్లిలో వైఎస్సార్ సీపీ సమావేశం

కొయ్యూరు: చింతపల్లిలో ఈ నెల 16న ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి హాజరయ్యే వైఎస్సార్‌సీపీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, పార్టీ మండలాధ్యక్షుడు జల్లి బాబులు కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ మండలానికి చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్, పీఏసీఎస్ చైర్మన్, గృహ సారథులు, కన్వీనర్లు ఉదయం పది గంటలకు విధిగా హాజరు కావాలని సూచించారు.

డిగ్రీ కళాశాలలో హర్ ఘర్ తిరంగా



జాతీయ జెండా ప్రదర్శిస్తున్న అధ్యాపకులు

సాక్షి పాడేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆజాదీకా అమృత మహోత్సవం ముగింపు సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వనము చిట్టబ్బాయి ఆదేశాల మేరకు ఆదివారం కళాశాల సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయ జెండా ఎగుర వేశారు. ఈ సందర్భంగా మహిళా సాధికారిత సమన్వయకర్త అశ్విని రెడ్డి మాట్లాడుతూ యువత జాతీయ జెండాను, ఆచార, సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించాలన్నారు. మహిళా సాధికారిత సభ్యురాలు డాక్టర్ ఎస్. చంద్రకళ మాట్లాడుతూ మన మట్టి – మన దేశం గురించి దత్తత గ్రామాల్లో వలంటీర్లు అవగాహన కల్పించాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు సీహెచ్ అనిత, పి. రమేష్‌కుమార్, జి.గౌరీశంకర్ మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించామన్నారు. కళాశాల సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో పాంచ్ పతాన్ ప్రతిజ్ఞ చేయించారు. హర్ ఘర్ తిరంగాలో భాగంగా సోమవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం, పర్యావరణ పరిరక్షణ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది జయలక్ష్మి, అప్పలనాయుడు పాల్గొన్నారు.

వైద్యురాలు అపర్ణకు సత్కారం



డాక్టర్ అపర్ణను సత్కరిస్తున్న గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం సభ్యులు

అనకాపల్లిటౌన్ : పక్షవాతం, నరాల బలహీనత వంటి వ్యాధులతో బాధపడుతున్న పేదలకు ఉచితంగా ఫిజియోథెరపీ చేయనున్నట్లు వైద్యురాలు పి.హెచ్.ఎస్.అపర్ణ తెలిపారు. స్థానిక నెహ్రూచౌక్‌లోని తమ కార్యాలయం మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అపర్ణను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు 300 మంది పేదలకు ఉచితంగా ఫిజియోథెరపీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కోరుకొండ వీరభద్రరావు, జోనల్ ఉపాధ్యక్షుడు అలక రాజు, జోనల్ మీడియా కో ఆర్డినేటర్ వై.వి.రమణి, కోశాధికారి బత్తుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహబంధం.. ఎంతో మధురం



పాతికేళ్ల తర్వాత కలుసుకున్న 1997-98 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

కె.కోటపాడు : వారంతా 1997–98లో కె.కోటపాడు హైస్కూల్ టెన్త్ బ్యాచ్ విద్యార్థులు. పాతికేళ్ల క్రితం పదో తరగతి పూర్తి చేసుకున్నారు. బాల్యంలో ఏర్పడిన స్నేహం గాఢత మళ్లీ వారిని దగ్గరకు చేర్చిందనడంలో అతిశయోక్తి లేదు. చదువుల వేటలో కొందరు, బతుకు పోరులో మరి కొందరు తలోదారి వెతుకున్నారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగాలు, మరి కొందరు ప్రయివేట్/కార్పొరేట్ సంస్థల్లోనూ, ఇంకొందరు వ్యవసాయంలో బతుకును స్థిరపరచుకున్నారు. మళ్లీ ఇన్నేళ్లకు వారంతా ఆదివారం ఓ చోట కలుసుకున్నారు. ఇందుకు తమకు బతుకు బాట చూపిన పాఠశాల ఆవరణే వేదికయింది. పదో తరగతి పూర్తి చేసుకుని పాతికేళ్లయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ తమ పాత మిత్రుల్ని కలుసుకుని, మనసారా పలకరించారు. ఒకరి కుటుంబం గురించి మరొకరు తెలుసుకుని, ఆనందించారు. పాతికేళ్లనాటి చిలిపి చేష్టలను మననం చేసుకుని సందడి చేశారు. అందులో ఇప్పుడు టెన్త్ దాటి చదువుతున్న పిల్లలున్న వారు కూడా కొందరున్నారు. తమ తల్లి/తండ్రి పదో తరగతి మిత్రులతో కలిసి చేస్తున్న సందడిలో ఈ పిల్లలూ భాగమయ్యారు. ఓ గొప్ప సంప్రదాయానికి, ఆనందానికి వారధులయ్యారు. ఈ సిల్వర్ జూబ్లీ వేడుకలకు పూర్వ విద్యార్థులు 110 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమ విజయవంతానికి సహకరించిన పూర్వ విద్యార్థులు మామిడి కిషోర్, బండారు పేరునాయుడు, పట్నాల వెంకటలక్ష్మి, నీలి సూర్యనారాయణ, బొడ్డు అవతారం, ఏటూరి వెంకటేష్‌లను తోటి స్నేహితులు మనసారా అభినందించారు.

భూముల రీసర్వేపై రౌండ్ టేబుల్ సమావేశం

అనకాపల్లిటౌన్ : స్థానిక మెయిన్ రోడ్డు ప్రజా రాజకీయ వేదిక కార్యాలయంలో ఆదివారం ల్యాండ్ రీ సర్వే అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీ సర్వేకు సంబంధించి సరి చేసిన తర్వాతనే రికార్డుల స్వచ్ఛతకు చర్యలు తీసుకోవాలని, సాగులో ఉన్న విస్తీర్ణం కంటే తగ్గించి చెప్పడాన్ని తప్పుపడుతున్నట్లు తెలిపారు. ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్‌బాబు, టీడీపీ నాయకుడు బొలిశెట్టి శ్రీను, సీపీఐ నాయకుడు వై.ఎస్.భద్రం, సీపీఎం నాయకుడు ఎ.బాలకృష్ణ పాల్గొన్నారు.


స్కేటింగ్ పోటీలు ప్రారంభం



స్కేటింగ్ పోటీలను ప్రారంభిస్తున్న దాడి జయవీర్

అనకాపల్లిటౌన్ : విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని విశాఖ ఉమ్మడి జిల్లాల ఖో–ఖో అసోసియేషన్ అధ్యక్షుడు దాడి జయవీర్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు వివేకానంద స్వామి యూనిక్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 7వ అంతర్ స్కేటింగ్ బాల బాలికల పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో 450 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకుని రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో బహుమతులు గెలుపొందాలని ఆయన కోరారు. క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చన్నారు.

బారులు తీరిన బాతులు



శృంగవరంలో రోడ్డుపై తరలిస్తున్న బాతులు

నాతవరం : ప్రతీ ఏడాదిలానే తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి బాతులను వాటి పెంపకందార్లు నాతవరం మండలానికి తీసుకువచ్చారు. ఖరీఫ్ కాలంలో తాండవ జలాశయం నీటి విడుదల తర్వాత ఆయా జిల్లాల నుంచి బాతులను పెంపకం కోసం వాటి యజమానులు తెస్తుంటారు. మండలంలో ఆదివారం శృంగవరం, ఎం.బి.పట్నం, గాంధీనగరం గ్రామాలకు వీటిని తెచ్చారు. దీంతో రోడ్డుపై బాతులు వందలాదిగా నడుస్తూ చూపరుల్ని ఆకట్టుకున్నాయి. తాండవ కాలువ నీరు పయనించే మార్గంలో ఈ బాతులు చేపలను, పంట పొలాల్లోని క్రిమికీటకాదులను ఆహారంగా తీసుకుంటాయి. వీటి ద్వారా పంటలకు ఎలాంటి నష్టం ఉండబోదని పెంపకందార్లు చెప్పున్నారు.

ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటా

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



కళావతిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ

హుకుంపేట: ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ అన్ని వేళలా అండగా ఉంటానని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. ఆదివారం హుకుంపేటలో ఆయన పర్యటించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కూడా మత్స్యలింగం భార్య కళావతి అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అన్ని వేళల అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సమిడ వెంకటపూర్ణిమ, పాంగి సింహాచలం, ఎంపీటీసీ భీమలింగేశ్వరరావు, వైస్ సర్పంచ్ గోవింద్, నాయకుడు పాంగి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే సమస్యల పరిష్కారం

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ అనంతబాబు



వృద్ధురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు, ప్రజాప్రతినిధులు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగిలో ఆదివారం మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7 గంటల వరకు జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ ఈ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ తిరిగి పేరు పేరున యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నూకాలమ్మ గుడి వీధి, గొల్లపల్లి వారి వీధి, గాంధీబొమ్మ సెంటర్, బీసీ వీధి, శివాలయం వీధిలో దాదాపు 350 గృహాలను ఆయన అధికారులతోపాటు సందర్శించారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేశారు. స్థానికులు వెల్లడించిన పలు సమస్యలపై స్పందించిన ఆయన సత్వర పరిష్కారానికి అధికారులకు సూచనలు ఇచ్చారు. గ్రామదేవత నూకాలమ్మ గుడి వీధిలో వేసిన తాగునీరు బోరు కబ్జాకు గురయ్యిందని, మరో కొత్త బోరు వేయాలని స్థానికులు ఎమ్మెల్సీని కోరారు. వెంటనే బోరు వేయించాలని ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నారాయణకు సూచించారు. అదే వీధిలో ఖాళీగా ఉన్న సామూహిక పాయఖానా స్థలంలో వ్యర్థాలను తొలగించి శుభ్రపరచాలని, దుర్గంధం వెలువడకుండా దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక పంచాయతీ సెక్రటరీ మల్లేశ్వరరావును ఆదేశించారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు, వైస్ ఎంపీపీలు చప్పా చంద్రరాణి, జుర్రా రాజేశ్వరి, ఎంపీటీసీ సభ్యురాలు కనిగిరి గంగదుర్గ, సర్పంచ్‌లు చీడి శివ, ఆగూరి శుభలక్ష్మి, సవిరెల చంద్రుడు, దాసరి నాగేశ్వరరావు, మిరియాల సత్యవతి, గణలక్ష్మి, నాయకులు చీడిపల్లి అప్పారావు, శాంతకుమారి, కుశరాజు, జాన్‌బాబు, చంద్రరావు, దుర్గాప్రసాద్, రాంబాబు, ముసలయ్య, వీరబాబు, ఎంపీడీవో యాదగిరీశ్వరావు, ఏపీఎం ఆదినారాయణ, ఏపీఓ సురేష్‌కుమార్, సీఐ షేక్ బాజిలాల్, ఎస్సైలు గోపీ నరేంద్రప్రసాద్, రఘునాథరావు పాల్గొన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

రంపచోడవరం: రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం రంపచోడవరంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రామకృష్ణ మఠం ఆఫీస్ ఇన్‌చార్జి స్వామీ వేద విద్యానందజీ మహరాజ్ పాల్గొని సేవలను పరిశీలించారు. వైద్యులు జి.భాస్కర్, తలారి వెంకట సుబ్బారావు, రాయుడు శ్రీనివాస్, ఎస్.సంపత్ కుమార్ 300 మంది రోగులను పరీక్షించారు. 69 మందికి రక్తపరీక్షలు, పది మందికి థైరాయిడ్‌పరీక్షలు, పది మందికి ఎక్స్‌రే, ఏనిమిది మందికి ఫిజియోథెరపీ చేశారు. అదేవిధంగా పరమహంస యోగానంద నేత్రాలయం వేమగిరి ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా 59 మందిని పరీక్షించారు. 16 మందికి కళ్లజోళ్లు, ఆరుగురిని నేత్ర శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని పరమహంస యోగానంద నేత్రలయం వేమగిరి తరలించారు. రోగులకు, వారి సహాయకులకు అన్నదానం నిర్వహించినట్లు మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. ఈ శిబిరంలో క్యాంప్ కో – ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వలంటీర్ గాదిరాజు వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరాగి పద్ధతిలో నాట్లు వేస్తే అధిక దిగుబడి



శ్రీరాగి పద్ధతి నాట్లు వేయిస్తున్న యూనిట్ ఇన్‌చార్జి ప్రసాద్

జి.మాడుగుల: ప్రకృతి వ్యవసాయంలో శ్రీరాగి పద్ధతిలో నాట్లు వేస్తే రైతుకు అధిక దిగుబడి వస్తుందని రైతు సాధికార సంస్థ ఎం. నిట్టాపుట్టు యూనిట్ ఇన్‌చార్జి ఎం. ప్రసాద్ తెలిపారు. కోరాపల్లి పంచాయతీ పాలకొండ గ్రామంలో ఆదివారం రైతులకు శ్రీరాగి పద్ధతిలో నాట్లుపై అవగాహన కల్పించారు. రైతులు పండించే సాధారణ పద్ధతిలో మార్పు చేసే విధంగా ప్రయత్నాలు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. వారితో శ్రీరాగి, గులీరాగి పద్ధతిలో నాట్లు వేయించారు, సాధారణ వెదజల్లే పద్ధతిలో ఎకరానికి నాలుగు కిలోల నుంచి ఐదు కిలోల విత్తనాలు జల్లితే నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని, ప్రకృతి వ్యవసాయంలో గులిరాగి పద్ధతిలో ఎకరానికి పావు కిలో – అర కిలో విత్తనాలు సరిపోతుందన్నారు. నారు వేసిన దగ్గర నుంచి కోత దశకు వచ్చే వరకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే ఏడు నుంచి ఎనిమిది క్వింటాళ్ల అధిక దిగుబడి పొందవచ్చని పేర్కొన్నారు. ప్రతి రైతు రాగి చిరుధాన్యాలు పండించుకోవాలని, వాటిని వినియోగించుకుంటే ఆరోగ్యానికి మంచిదని వివరించారు. కార్యక్రమంలో సీఆర్పీ కె. సురేష్ పాల్గొన్నారు.

పరిశుభ్రమైన ఆహారంతో దృఢమైన ఎముకలు



వైద్యుడు సంపత్‌ను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

అనకాపల్లిటౌన్ : ఎముకల దృఢత్వానికి పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని, ఉదయం రోజూ అరగంట ఎండలో ఉండటం వల్ల ఎముకలపై సూర్యకిరణాలు పడి ఆరోగ్యంగా జీవించవచ్చని కీళ్లు, ఎముకల వైద్యుడు వి.సంపత్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు వన్‌వే ట్రాఫిక్ డౌన్ రహదారిలో వాకర్స్ క్లబ్, గీతా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుమటాయిడ్ ఆర్థరైటిస్ (ఆర్ఏ) అనేది దీర్ఘకాలిక వ్యాధి అన్నారు. కీళ్లలో నొప్పి, వాపు, బిగువును కలగచేస్తుందని తెలిపారు. మొదటి దశలో చికిత్స చేస్తే పూర్తిగా నయమవుతుందని అన్నారు. 80 మంది రోగులకు ఉచితంగా ఎముకల పరీక్షలు చేసి, అవసరమైన రోగులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం క్లబ్ సభ్యులు వైద్యుడిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు యల్లపు శ్రీను, కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి రాపేటి నారాయణరావు, సభ్యులు కేటీవీ సత్యనారాయణ, బీవీ రమణ, మల్లికార్జునరావు, దాడి సూరిబాబు, శరగడం నూకరాజు తదితరులు పాల్గొన్నారు.